క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాల్లో మంత్రి ఆర్కే రోజా శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7.30 గంటలకు టీఆర్ కండ్రిగ సచివాలయ పరిధిలో, సాయంత్రం 4.30 గంటలకు నగరి మున్సిపాలిటీ ఇందిరా నగర్ సచివాలయ పరిధిలో పర్యటిస్తారన్నారు.

వైభవంగా మాతమ్మ ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో మాతమ్మ దేవత

నగరి : మండలంలోని యం.కొత్తూరు ఏఏడబ్ల్యూ గ్రామంలో మాతమ్మ తిరనాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. ఆరురోజుల పాటు జరిగే ఈ తిరనాళ్లలో భాగంగా గురువారం ఉదయం అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆలయం వద్ద వేసిన పోతురాజు పరుశురాం ముగ్గు చూపరులను అలరించింది. ఉత్సవాల్లో భాగంగా పుట్టపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పి.సుబ్రహ్మణ్యం, బాబు, సుబ్రహ్మణ్యం, నాగేష్, యుగంధర్, గోవిందుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. మండలంలోని పెద్దకాల్వ గ్రామ సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించాలని ఫిర్యాదు చేసిన సమస్యలను ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, ఈఓపీ ఆర్డీ శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

శ్రీరంగరాజపురం: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మండలంలోని తయ్యూరు, శ్రీరంగరాజపురం, పద్మపురం, 50 బసివిరెడ్డి పల్లె గ్రామాల్లో చేస్తున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. పనిచేసే ప్రాంతాల్లో తమకు మౌలిక సదుపాయాలను కల్పించాలని కూలీలు ఆయన్ను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వరదమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్ పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

కోట: మండల పరిధిలోని లక్ష్మక్కకండ్రిగ వద్ద మోటార్ బైక్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో యువకుడు గాయపడిన సంఘటన గురువారం రాత్రి వెలుగు చూసింది. లక్ష్మక్కకండ్రిగకు చెందిన నాగేంద్ర కోట క్రాస్ రోడ్డు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన నాగేంద్రను స్థానికులు కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి ఇస్తున్న ఢిల్లీబాబు, టీచర్లు

పాలసముద్రం : మండలంలోని ఆముదాల పంచాయతీ కావేరిరాజుపురం ప్రాథమిక పాఠశాలకు ఢిల్లీబాబు రూ 25 వేల విలువ చేసే విద్యాసామగ్రిని గురువారం వితరణ చేశారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు మొదలైనవి ఆయన పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ, ఇక్కడి స్కూలులో టీచర్‌గా 15 ఏళ్లు సేవలందించిన తన తండ్రి సురేందర్‌రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకుని ఈ వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఆయన వద్ద చదివిన విద్యార్థులు ఎందరో ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్, ఆట వస్తువులు, కుర్చీలు, ప్లేట్లు, గ్లాసులను కూడా ఢిల్లీబాబు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయలక్ష్మి, వాసునాయుడు, భక్తవత్సల నాయుడు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



తోఫా పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు

పాలసముద్రం : రంజాన్ పండుగ పురస్కరించుకుని మండలంలోని ముస్లింలకు గురువారం జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్ రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కూడా ప్రాధాన్య ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, లిల్లీ, వైస్ ఎంపీపీ పుష్ప, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, సుందరరాజు, పుత్తూరు కేశవరెడ్డి, షణ్ముగరెడ్డి, రవిరెడ్డి, చంద్రశేఖర్ రాజు, కేశవన్, గోపాల్, ముస్లింలు పాల్గొన్నారు.

ముందస్తు పన్నుకు ప్రజా స్పందన

- 5 శాతం రాయితీ కల్పించిన ప్రభుత్వం
- పన్నుల చెల్లింపునకు ఆసక్తి చూపుతున్న పట్టణప్రజలు
- రూ.30 లక్షల మేర వసూలు



మున్సిపల్ కార్యాలయం

నగరి : పురపాలక సంఘాలకు 2022–2023 ఆర్థిక సంవత్సరం ముగిసింది. పాత బకాయిలకు ఎలాంటి వడ్డీ లేకపోవడంతో నగర ప్రజలు ఇంటి పన్ను, నీటి పన్నులను చెల్లించారు. దీంతో పురపాలక సంఘానికి గణనీయంగా ఆదాయం వచ్చింది. రూ.2.60 కోట్లు వసూలైంది. ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో 2023–2024 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇంటి పన్ను, నీటి పన్నుపై 5 శాతం రాయితీ కల్పించడంతో పన్నుదారులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో వచ్చే ఏడాది (ముందస్తు పన్ను) మార్చి నెలాఖరులోపు చెల్లించాల్సిన పన్నులను సైతం ఇప్పుడే చెల్లిస్తున్నారు. ప్రతిరోజు మున్సిపల్ కార్యాలయ పన్ను కౌంటర్ల వద్ద ముందస్తు పన్ను చెల్లించేందుకు అసెస్‌మెంట్ దారులు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు.

ప్రత్యేక కౌంటర్..

మున్సిపాలిటీకి చెందిన వారు అధిక సంఖ్యలో ముందస్తు పన్నులు చెల్లించేందుకు వస్తుండడంతో కార్యాలయం వద్ద పన్నుదారులు కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు ఈ కౌంటర్లను పర్యవేక్షిస్తున్నారు. ఈనెలాఖరు వరకు పన్నులు చెల్లించే పన్నుదారులకు రాయితీ ఉంది. దీంతో ప్రతి రోజు కౌంటర్లు నిర్ణీత వేళల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు సెలవు దినాల్లోనూ సిబ్బందిని నియమించే ఏర్పాట్లు చేశారు. నగరి పురపాలక సంఘం పరిధిలో 14,200 మంది పన్ను చెల్లింపుదారులు (అసెస్మెంట్లు) ఉండగా నిర్ధారించబడిన ఇంటి పన్ను, నీటి పన్ను రూ.2.5 కోట్లు ఉంది. ఏడాది కాలం పాటు వసూలు కావల్సిన పన్నులో ముందస్తు పన్ను చెల్లింపు ద్వారా ఈ నెల 1వ నుంచి 20వ తేదీ వరకు రూ.30 లక్షల మేర వసూలైంది.

5 శాతం రాయితీని వినియోగించుకోండి..



రాష్ట్రప్రభుత్వం ముందస్తు పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తోంది. దీనికి పురపాలక ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈనెలాఖరు వరకు గడువు ఉంటుంది. ప్రజల సౌకర్యార్థం సెలవు దినాల్లోనూ కౌంటర్లు పని చేసే విధంగా చర్యలు తీసుకున్నాం. ముందస్తు పన్నులు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి పాటుపడాలి.

– వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి

అభివృద్ధి కనిపించడం లేదా భాను?



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- గాలి భాను కంటికి పొర వచ్చిందేమో !
- నగరికి వచ్చి ఉంటే ఉచితంగా తొలగించేవాళ్లం
- పుత్తూరులో 2 అర్బన్ హెల్త్‌సెంటర్లు, మున్సిపల్ పార్కు, షాదీమహల్ ఏర్పాటు చేస్తున్నాం
- మున్సిపల్ చైర్మన్ హరి, వైఎస్సార్‌సీపీ నాయకుల ఫైర్

పుత్తూరు రూరల్: అభివృద్ధే జరగలేదని మాట్లాడుతున్న టీడీపీ నగరి ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్ కళ్లకు పొరలు కమ్మేసినట్లు ఉన్నాయని, ఆయనకు తక్షణం కంటి చికిత్స చేయించాలని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి హితవు పలికారు. ఇటీవల మంత్రి ఆర్కే రోజా నగరిలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారని, ఆ సమయంలో భాను అక్కడికి వచ్చి ఉంటే ఉచితంగా కంటి చికిత్స చేయించేవారమని చెప్పారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. హరి మాట్లాడుతూ మూనెళ్లకోమారు పుత్తూరుకు వచ్చి అభివృద్ధి జరగలేదనడం ఆయనకు పరిపాటి అయిందన్నారు. ఒక్క పుత్తూరులోనే మున్సిపల్ పార్కు, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, మున్సిపల్ కార్యాలయం, షాదీ మహల్, తెలుగు గంగ నుంచి పుత్తూరుకు మంచినీరు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న విషయం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి పోయిందంటూ మాట్లాడే అర్హత భానుకు ఏమాత్రం లేదన్నారు. సీఎంను విమర్శించే స్థాయి నీకు లేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి రాత్రికి రాత్రే హైదరాబాద్ నుంచి పారిపోయి అమరావతికి రావడం వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని ఆరోపించారు. చంద్రబాబు పరిపాలన సక్రమంగా ఉంటే గత ఎన్నికల్లో 23 సీట్లతో ప్రజలు ఎందుకు చిత్తుగా ఓడించారని ప్రశ్నించారు. గడచిన మూడున్నరేళ్లలోనే సీఎం జగనన్న 20 ఏళ్ల అభివృద్ధిని చేసి చూపించారని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ వీఎం మాహీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ డి.శంకర్, ఎంపీపీ మునివేలు, కౌన్సిలర్లు ఏకాంబరం, చిట్టిబాబు, బాలాజీ, నాయకులు శివయ్య, చిరంజీవి, మునిరత్నం, తిరునావక్కరుసు, బుజ్జి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుక పంపిణీ



వడమాలపేటలో ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుక అందజేస్తున్న నాయకులు

వడమాలపేట : నియోజకర్గంలో మైనారిటీల అభివృద్ధికి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఎంతో కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సురేష్‌రాజు అన్నారు. గురువారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా మండలంలోని ముస్లిం కుటుంబాలకు మంత్రి ఆర్‌కే రోజా ఏర్పాటు చేసిన రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, నగరి నియోజకవర్గంలో మంత్రి రోజా తన చారిటబుల్ ట్రస్టు ఇక్కడి ముస్లింలను ఆదుకుంటున్నారని తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ఎంతో నిష్ఠతో ఉపవాసం చేసే ముస్లింలకు అల్లా మంచి చేయాలని కోరారు. అనంతరం రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సదాశివయ్య, కాయం సింగిల్‌విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ బాబుసాహెబ్, నాయకులు యాదవేంద్రరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, నందయ్య, చిన్నబ్బ, ఉమాపతి, వేణు, బాబు, అయ్యప్పరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉజ్వల భవిత



మహిళా వర్సిటీ విద్యార్థినులు, అధ్యాపకులతో కెనడా ప్రొఫెసర్లు

తిరుపతి ఎడ్యుకేషన్: ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థినులు చదువుతో పాటు యాజమాన్య నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని తెలిపారు. వర్సిటీలో 20 రోజులుగా బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థినులకు కెనడాకు చెందిన ఇద్దరు ప్రొఫెసర్లుచే నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ప్రసంగించారు. శిక్షణ ద్వారా బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థినులు భవిష్యత్తులో కంపెనీల స్థాపనకు అనుగుణమైన పరిస్థితులు, అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలో తెలుసుకున్నారన్నారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించి కెనడా ప్రొఫెసర్లు బ్రెండా స్టోక్స్, సబ్రినా రాయ్ అన్ని అంశాలతో విద్యార్థినులకు అవగాహన కల్పించారని తెలిపారు. అనంతరం కెనెడా ప్రొఫెసర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కళాశాల డీన్ ప్రొఫెసర్ కె.అనురాధ, ఇంటర్నేషనల్ డీన్ విజయలక్ష్మి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి బి.విజయలక్ష్మి, ఎన్. శ్రీరజిని, పి.రూప, యువశ్రీ పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని సెబ్ కార్యాలయం వద్ద అధికారులు వివిధ కేసుల్లో సీజ్ చేసిన మద్యం సీసాలను గురువారం ధ్వంసం చేశారు. శ్రీకాళహస్తి సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 73మద్యం సీసాలు, 53 సారా ప్యాకెట్లను ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో సెబ్ తిరుపతి ఏఈఎస్ శ్రీనివాసరావు, సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

గంగాధరనెల్లూరు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగాధరనెల్లూరు–1, వేల్కూరు–2, నందనూరు–1, కలిజవేడు–2, వరత్తూరు–1, వేపంజేరి–3, బంగారెడ్డిపల్లి–1, తూగుండ్రం–1, నెల్లేపల్లి–1, వింజం–1, బాలగనంపల్లి–1 చొప్పున మొత్తం 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వయస్సు 18–35 ఏళ్లలోపు ఉన్నవారు ఈనెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భూ రీసర్వేపై అవగాహన

శ్రీరంగరాజపురం : భూ రీ సర్వే పనులను నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై ఆదేశించారు. గురువారం ఆయన భూ రీ సర్వేపై వీఆర్‌ఓ, సర్వేయర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ సర్వేతో భూ సమస్యలకు శాశ్వతంగా చెక్ పెట్టవచ్చని, సులువుగా ప్రభుత్వ భూములను గుర్తించవచ్చన్నారు. మండలంలోని ముద్దుకుప్పం, పుళ్లూరు సచివాలయ పరిధిలోని గ్రామాలలో రీ సర్వే చేస్తామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఆర్‌ఐ త్యాగరాజులు, మండల సర్వేయర్ మురళి పాల్గొన్నారు.

తృణ ధాన్యాల ఆహారమే ఉత్తమం



తృణధాన్యాలను పంపిణీ చేస్తున్న అరుణాచలం రెడ్డి

కార్వేటినగరం: తృణధాన్యాల ఆహారం ఉత్తమమని విశ్రాంత వెల్ఫేర్ అధికారి అరుణాచలం రెడ్డి అన్నారు. గురువారం రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సజ్జ, రాగి, జొన్నలను వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ, బియ్యం ఉత్పత్తులకు ముందు తృణధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్లే నాటి ప్రజలు ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంటున్నారని, ప్రస్తుత వ్యవసాయ ఉత్పత్తులన్నీ రసాయనాలతో కూడినవి కావడంతో పలు వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఆహారమే ఔషధంగా మారే విధానం తృణధాన్యాలతో సాధ్యమన్నారు. కార్యక్రమంలో రాస్ కో–ఆర్డినేటర్ ప్రకాష్ తోపాటు విజయకుమారి, ఘటికాచలంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయానందరెడ్డికి రుణపడి ఉంటాం

శ్రీరంగరాజపురం : ముస్లింలకు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి రంజాన్ తోఫా ఇవ్వడం అభినందనీయమని మండల ముస్లింల అధ్యక్షులు బాబుసాహెబ్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని 50బసివిరెడ్డిపల్లె, ముద్దుకుప్పం, శ్రీరంగరాజపురం, పుల్లూరు, 49కొత్తపల్లిమిట్ట, నెలవాయి, జంగాలపల్లెలోని 370 కుటుంబాలకు విజయానందరెడ్డి ప్రతి ఏటా రంజాన్ తోఫా ఇస్తున్నారని, ఈ ఏడాది కూడా రంజాన్‌తోఫా పంపిణీ చేశారని, ఆయనకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కాళప్ప, గండుమణి, మణి, కుప్పయ్య, కుమార్, చంద్రశేఖర్, శీను, సుధాకర్, తంబి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు



సమస్యలను తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: గ్రామాల్లో అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేసి కట్టిస్తామని ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి హామీ ఇచ్చారు. కులమతాలు, పార్టీలకతీతంగా తమ ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తోందని పునరుద్ఘాటించారు. గురువారం మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలో నల్లవెంగనపల్లె, చెంజి దళితవాడ, కేవీఎం అగ్రహారం, తాటిమాకులపల్లె, ఉప్పరపల్లె, బుడ్డారెడ్డికండ్రిగ, కొంగారెడ్డి ఊరు, కిచ్చమనాయుడుపల్లె, బాలకృష్ణాపురం గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై పైవిధంగా స్పందించారు. గ్రామాల్లో సిమెంట్లు వేయిస్తామన్నారు. వెలుగు ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక సాయం చేయాలని ఏపీఎం కవితను, అవసరమైన గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పుల్లారెడ్డిని, గ్రామాల్లో దుస్థితిలో ఉన్న రోడ్ల గుర్తించాలని పంచాయతీరాజ్ శాఖ డీఈ దయాకర్‌రెడ్డిని ఆయన ఆదేశించారు. అధికారులు అందరూ బాధ్యతగా, ప్రభుత్వ ఆశయాలను అనుగుణంగా పనిచేసి ప్రజలకు మేలు చేయాలని సూచించారు.

చంద్రబాబు వస్తే పథకాలు రద్దు

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉన్నంత కాలం ప్రజల బాధలు, కష్టాలను గాలికొదిలేశారని, ఆయనకు స్కామ్‌లు తప్ప స్కీమ్‌లు తెలియవన్నారు. మళ్లీ కల్లబొల్లి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. బాబు వస్తే ఉన్న పథకాలను రద్దు చేసి పేద ప్రజలను మరింత అట్టడుగుకు తీసుకెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీడీఓ సుధాకరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, ఎంపీటీసీలు చిన్నబ్బ, మునిచంద్రారెడ్డి, భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, మాజీ ఎంపీటీసీలు రోశిరెడ్డి, గురవారెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సీనియర్ నాయకుడు పేట ధనంజయరెడ్డి, సర్పంచులు పుష్ప, గోవిందయ్య, శ్రీనాథరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, స్థానిక నాయకులు గణపతిరెడ్డి, నరేంద్ర, మాజీ సర్పంచ్ గోవిందన్, భీమశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి సరఫరాపై దృష్టి సారించండి



సమస్యలు తెలుసుకుంటున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి సూచించారు. గురువారం మున్సిపాలిటీ 14, 19 వార్డుల్లో ఆయన పర్యటించారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు సూచించారు. పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, కౌన్సిలర్ ఏకాంబరం, నాయకులు మనోహర్‌రెడ్డి, కుట్టి, చక్రి తదితరులు ఉన్నారు.

వలంటీర్‌కు పరామర్శ..

19వ వార్డు వలంటీర్ లత భర్త శ్రీనివాసులు గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుమారస్వామిరెడ్డి వారి ఇంటికి వెళ్లి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వలంటీర్ లతకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం : రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి జే.మురళీకృష్ణ కోరారు. మండలంలోని ఆముదాల, వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయిలో పంటలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎక్కువగా రసాయనిక ఎరువులను వాడితే సారవంతమైన భూములు 15 ఏళ్లకు చౌడు భూములుగా మారిపోతాయని, సేంద్రియ ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్, వ్యవసాయ సహాయకులు మధు, నవనీత, రైతులు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధి నిర్మూలనకు కృషి



బోదకాలు బాధితురాలిని పరీక్షిస్తున్న జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు

శ్రీరంగరాజపురం : బోదకాలు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని ఆరిమాకులపల్లె ప్రాథమిక వైద్యశాలను ఆయన సందర్శించారు. మండల వైద్యాధికారి బాలసుబ్రమణ్యం రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బోదకాలు బాధితులకు సోపులు, టవళ్లు, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గౌరి, మోహన్‌బాబు, పర్యవేక్షకులు నారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాల ప్రదర్శన



అగ్నిమాపక పరికరాల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

నగరి : అగ్నిమాపక వారోత్సవాల్లో చివరిరోజైన గురువారం ఫైర్ ఆఫీసర్ మస్తాన్ అగ్నిమాపక కేంద్రంలో అందుబాటులో ఉన్న పరికరాలను ప్రదర్శనగా ఉంచారు. వాటి పనితీరును ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంచుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన్నప్పుడు ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రతాప్, డీసీ రాజు, ప్రవీణ్ కుమార్, విజయ్, మల్లికార్జున, ప్రకాష్, కోటేశ్వరరావు, మధు, జాకీర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జగనన్నే మా నమ్మకం



జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్



కార్వేటినగరంలో..



పాలసముద్రం : వీఆర్ కుప్పం గుట్టమీద ఇండ్లలో..

నగరి : అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పరిపాలనలో మన భవిష్యత్ జగనన్నే అని చాటిచెప్పాలని మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్ పిలుపునిచ్చారు. గురువారం సత్రవాడలో నాయకులు, కార్యకర్తలతో కలిసి జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేసి ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆర్థిక భరోసా కల్పించే సుపరిపాలనను ప్రతి కుటుంబీకులు ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి లబ్ధిదారుని వద్ద నుంచి సంతకం తీసుకుని వారి ఫోన్ నంబర్ ద్వారా మిస్డ్ కాల్ చేయించి గృహయజమాని అనుమతితో స్టిక్కర్ అంటిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నేత అనుబంధ సంఘ అధ్యక్షుడు కన్నాయిరం, అయ్యప్ప పాల్గొన్నారు. ఏకాంబరకుప్పంలో కౌన్సిలర్ భూపాల్ ఆధ్వర్యంలో గృహసారథులు, పార్టీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి అభిప్రాయ సేకరణ చేసి స్టిక్కర్లు అతికించారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్తు'

కార్వేటినగరం: స్థానిక టీవీఎం వీధి, బొందు వీధి, దివిటి వీధులలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే పథకాలను తెలియజేసి స్టిక్కర్లను అంటించారు. పథకాలతో ఎంతో మేలు పొందామని కొందరు హర్షం వ్యక్తం చేశారు. మండల యువత అధ్యక్షుడు ధనశేఖర్ యాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు గిరిజ, దామురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాలాజి పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీలో గురువారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఆముదాల ఎంపీటీసీ లిఖిత, వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ, నాయకులు పాల్గొన్నారు